RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్: చెరుకు ఉపేందర్ | సోమవారం 6 జనవరి 2025

సంపుటి: 2 | సంచిక: 238 | పేజీలు: 4 | వెల: రూ.5/-

# ఏసీబీ విచారణకు కేటీఆర్?

## ఫార్ములా ఈ-రేస్ కేసులో సోమవారం మరో కీలక పరిణామం



హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): ఫార్ములా ఈ-రేస్ కేసులో సోమవారం మరో కీలక పరిణామం చోటు చేసుకోబోతుంది. ఏసీబీ నోటీసుల విషయంలో కేటీఆర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఉత్కంఠగా మారింది. ఇంతకీ ఆయన విచారణకు హాజరవుతారా.. లేదా? హాజరవకపోతే ఏసీబీ ఏం చేయబోతోంది?.. ఆ డీటేల్స్ తెలుసుకుందాం పదండి...

ఫార్ములా ఈ రేసు కేసులో ఏసీబీ అధికారుల విచారణకు కేటీఆర్ హాజరవుతారా లేదా అనే అంశంపై మరికొన్ని గంటల్లోనే క్లారిటీ రాబోతోంది. ఈ నెల 6న ఉదయం 10 గంటలకు తమ ఎదుట విచారణకు హాజరు కావాల్సిందిగా కేటీఆర్‌కు రెండు రోజుల క్రితం ఏసీబీ అధికారులు నోటీసులు జారీ చేశారు. దీంతో విచారణకి కేటీఆర్ వస్తారా లేక సమయం కోరుతారా అనే అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఒకవేళ ఆయన విచారణకు రాకుంటే.. విపక్షాలు విమర్శించే అవకాశం ఉంది. కాబట్టి ఖచ్చితంగా విచారానికి హాజరవుతారనే వినికిడి ఎక్కువగా వినిపిస్తుంది. ఒకవేళ ఏసీబీ విచారణకు కేటీఆర్ హాజరైతే ఫార్ములా ఈ రేసులో అసలేం జరిగిందనే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సి ఉంటుంది. ఆయన సమాధానాల ఆధారంగానే ఏసీబీ అధికారులు ముందుకు వెళ్లనున్నారు.

ఈ కేసులో క్వాష్ పిటిషన్‌పై తుది తీర్పు వెల్లడించే వరకు కేటీఆర్‌పై చర్యలు తీసుకోవద్దంటూ హైకోర్టు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చింది. కాబట్టి ఏసీబీ విచారణకు కేటీఆర్ హాజరైనా అరెస్టు చేసే పరిస్థితులు ఉండవని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.

### ఏడో తేదీన విచారణకు రావాలని ఈడీ నోటీసులు

ఇక ఆరో తేదీన ఏసీబీ విచారణ ముగిసిన తర్వాత.. ఆ మరుసటిరోజే, అంటే ఏడో తేదీన ఈడీ అధికారుల ఎదుట ఆయన హాజరు కావాల్సి ఉంటుంది. మరి ఈ రెండు దర్యాప్తు సంస్థల ముందు ఆయన హాజరవుతారా లేదా అనే సస్పెన్స్ కొనసాగుతోంది. ఏసీబీ ఎదుట హాజరై ఈడీ ముందు హాజరయ్యేందుకు కేటీఆర్ సమయం కోరే అవకాశం కూడా ఉందనే చర్చ జరుగుతోంది. మరోవైపు ఈడీ నోటీసులపై హైకోర్టును ఆశ్రయించాలా వద్దా అనే అంశంపై బీఆర్ఎస్ లీగల్ టీంతో కేటీఆర్ ఇప్పటికే పలుమార్లు చర్చించినట్లు సమాచారం. ఈ ఫార్ములా కేసులో కేటీఆర్‌తో పాటు అరవింద్‌కుమార్, B.L.N రెడ్డిలకు రెండు దర్యాప్తు సంస్థలు నోటీసులు జారీ చేశాయి. అయితే ఈడీ అధికారుల ముందు హాజరయ్యేందుకు ఇద్దరు కూడా సమయం కోరారు. దీంతో ఈనెల 8, 9 తేదీల్లో తమ ఎదుట హాజరు కావాలని ఏసీబీ నోటీసులు పంపింది. వాళ్ల విచారణ కంటే ముందే కేటీఆర్‌ను అధికారులు విచారణకు పిలిచారు. ఈ నేపథ్యంలో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకోబోతున్నాయనేది ఆసక్తిగా మారింది.



## ఆప్ పాలనలో ఢిల్లీ అభివృద్ధి
# పట్టాలు తప్పింది
### ప్రధాని నరేంద్ర మోదీ

2



## జాతీయ రాజకీయాల్లో తెలుగువారి పాత్ర
# సన్నగిల్లింది
### సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): విదేశాలకు వెళ్లిన తెలుగువారంతా ఒకే వేదిక మీదకు రావడం సంతోషంగా ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ హెచ్ఐసీసీ వేదికగా 3 రోజుల పాటు జరిగిన ప్రపంచ తెలుగు సమాఖ్య 12వ మహాసభల ముగింపు కార్యక్రమానికి సీఎం ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. విదేశాలకు వెళ్లిన వారికి తెలుగుతో అనుబంధం తగ్గిపోతోందని, నాలెడ్జ్ కోసం ఏ భాష నేర్చుకున్నా తెలుగును తక్కువ చేయొద్దని సూచించారు. హైదరాబాద్‌లో అద్భుతమైన అంతర్జాతీయ సంస్థలు ఉన్నాయని, నగరాభివృద్ధికి పాటుపడేందుకు తెలుగు పారిశ్రామిక వేత్తలను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. "రాజీవ్‌గాంధీ ఈ దేశానికి కంప్యూటర్‌ను పరిచయం చేసి... సాంకేతిక నైపుణ్యాన్ని

..మిగతా 2లో

## 'హైడ్రా' దూకుడు
# మళ్లీ షురూ
### మాదాపూర్‌లో 5 అంతస్తుల భవనం కూల్చివేత



2

# ఏడాదిలో 55,143 ఉద్యోగాలు

## ఇది దేశంలోనే రికార్డు: సీఎం రేవంత్‌రెడ్డి




హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): వెనకబడిన రాష్ట్రమైన బిహార్ నుంచి అత్యధికంగా ఐఏఎస్‌లు వస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్: వెనుకబడిన రాష్ట్రమైన బిహార్ నుంచి అత్యధికంగా ఐఏఎస్‌లు వస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అక్కడ ప్రత్యేక శ్రద్ధ పెట్టడం వల్లే ఎక్కువ మంది ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు వస్తున్నారని పేర్కొన్నారు. ప్రజాభవన్‌లో నిర్వహించిన 'రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సివిల్స్ మెయిన్స్ ఉత్తీర్ణత సాధించి.. ఇంటర్వ్యూకు ఎంపికైన 20 మంది అభ్యర్థులకు ఆర్థిక సాయం అందించారు. ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ నుంచి సివిల్స్ అభ్యర్థులకు సాయం చేస్తున్నట్లు తెలిపారు. బిహార్‌ను స్ఫూర్తిగా తీసుకుని తెలంగాణలో ప్రోత్సాహకాలు ఇస్తున్నట్లు చెప్పారు. దీన్ని ఆర్థిక సాయంగా కాకుండా ప్రోత్సాహకంగా భావించాలన్నారు. వీరంతా సివిల్స్‌లో విజయం సాధించి తెలంగాణకే రావాలని ఆకాంక్షించారు. "తెలంగాణ అధికారులు కేంద్రంలో ఉన్నా రాష్ట్రం కోసం కృషి చేయాలి. మా ప్రభుత్వం వచ్చాక ఏడాదిలో 55,143 ఉద్యోగాలు ఇచ్చాం. ఇది దేశంలోనే

..మిగతా 2లో

## కుప్పకూలిన కోస్ట్‌గార్డ్ హెలికాప్టర్
### ముగ్గురు సిబ్బంది మృతి



2




## పెళ్లికాని జంటలకు
# ఇకపై నో రూమ్
### ఓయో కొత్త చెక్-ఇన్ పాలసీ

న్యూఢిల్లీ, (ప్రభాత సూర్యుడు): ప్రముఖ హోటల్ అగ్రిగేటర్ ఓయో కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త చెక్-ఇన్ పాలసీ తీసుకొచ్చింది. ఈ ఏడాదిలో

..మిగతా 2లో

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



# నాగర్‌కర్నూల్ జిల్లాలో విషాదం

## నీటి సంపులో పడి రైతు మృతి

**బిజినేపల్లి, (ప్రభాత సూర్యుడు):** ప్రమాదవశాత్తు నీటి సంపులోపడి ఓ రైతు మృతి చెందిన విషాదకర సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం వడ్డెమాన్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వడ్డెమాన్‌కు చెందిన గుంటి బంగారయ్య(40) రోజు మాదిరిగానే తన మక్క పంటకు నీరు పారపెట్టేందుకు వెళ్లాడు. ఈక్రమంలో పొలంలో ఉన్న నీటి సంపులో కాలుజారిపడ్డాడు. ఎవరూ గమనించకపోవడంతో సంపులోనే మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు వెల్లడించారు. బంగారయ్య మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.






# ‘అలాంటి సినిమాలను బహిష్కరించాలి’

## హైందవ శంఖారావంలో అనంత శ్రీరామ్

**గన్నవరం (ప్రభాత సూర్యుడు):** హిందూ ధర్మాన్ని నాశనం చేసే సినిమాలను ప్రతి ఒక్కరూ బహిష్కరించాలని సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ పిలుపునిచ్చారు. అలా చేస్తే అటువంటి సినిమాలకు డబ్బులు రావని, అప్పుడు హిందూ ధర్మాన్ని హననం చేసే సినిమాలను తీయరని తెలిపారు. కృష్ణా జిల్లా కేసరపల్లిలో గన్నవరం సమీపంలో విశ్వ హిందూపరిషత్ ఆధ్వర్యంలో జరిగిన ‘హైందవ శంఖారావం’ సభలో అనంత శ్రీరామ్ మాట్లాడారు. వ్యాస భారతం, వాల్మీకి రామాయణం భారత సాహిత్య వ్మాయానికి రెండు కళ్లు లాంటివని పేర్కొన్నారు. అలాంటి వాటినే ఎంటర్‌టైన్‌మెంట్ కోసం వక్రీకరించారని అన్నారు. సినిమాల్లో హైందవ ధర్మం మీద దాడి జరుగుతోందంటూ మండిపడ్డారు. హిందూ ధర్మానికి కళంకం కలుగుతోంది: వ్యాపారాత్మకమైన కళ, కళాత్మకమైన వ్యాపారం మూవీ అని, అయితే ఈ రెండింటినీ కలిపే క్రమంలో హిందూ ధర్మానికి కళంకం కలుగుతోందని అన్నారు. దేవాలయాలకు ఆత్మగౌరవం కోసం పెద్ద సంఖ్యలో హిందువులు తరలిరావడం సంతోషంగా ఉందని వ్యాఖ్యానించారు.

### ‘అలాంటి సినిమాలను బహిష్కరించాలి’ - హైందవ శంఖారావంలో అనంత శ్రీరామ్

క్షమాపణలు చెబుతున్నా: ఫిల్మ్ ఇండస్ట్రీలో జరిగే తప్పులను ఆ రంగానికి చెందిన వ్యక్తిగా బాహాటంగానే విమర్శిస్తున్నానని, ఇప్పటి వరకు మూవీస్‌లో జరిగిన హైందవ ధర్మ హననానికి హిందూ సమాజానికి క్షమాపణలు చెబుతున్నానని అన్నారు. పురాణాలు ఇతిహాసాల గొప్పతనాన్ని మూవీస్‌లో తగ్గించి క్యారెక్టర్స్ మార్చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చరిత్రను వక్రీకరించి హిందూ ధర్మాన్ని దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. వాల్మీకి, వ్యాసుడు రచనలను ఎంటర్‌టైన్‌మెంట్ కోసం వక్రీకరిస్తున్నారని తెలిపారు.

15 సంవత్సరాలుగా ఆ వ్యక్తికి పాటలు రాయలేదు: కృష్ణా జిల్లాకు చెందిన డైరెక్టర్స్, ప్రొడ్యూసర్స్ ఈ పొరపాటు చెప్పకపోతే ఎలా అని, పాత్రల ఔన్నత్యాన్ని మారిస్తే హైందవ ధర్మాన్ని ఆచరించినట్టు కాదని అనంత్ శ్రీరామ్ అన్నారు. నిండు సభలో ద్రౌపది వస్త్రాన్ని తీస్తున్నా మౌనంగా ఉన్న కర్ణుడు గొప్పవాడు ఎలా అవుతారని ప్రశ్నించారు. భారతం, రామాయణం, భాగవతాల్లో పురాణాలను ఇష్టం వచ్చినట్టు మార్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వక్రీకరణలు, అభూత కల్పనలు చేస్తున్నా మనం చూస్తూ ఊరుకుంటున్నామని అన్నారు.

షూటింగ్‌లో, పాటలలో ఎన్నో రకాల అవమానాలు జరిగాయని వ్యాఖ్యానించారు. ఒక డైరెక్టర్ పాటలో ‘బ్రహ్మాండ నాయకుడు’ అనే పదం ఉండ కూడదని చెబితే 15 సంవత్సరాలుగా ఆ వ్యక్తికి తాను పాటలు రాయలేదని తెలిపారు. హిందూ ధర్మాన్ని అవమానించేలా తీసిన మూవీస్‌ని ప్రభుత్వం నిషేధించాలని, లేదంటే హిందువులే పూర్తిగా వాటిని బహిష్కరించాలని పిలుపునిచ్చారు. అప్పుడే హిందూ ధర్మానికి ఒక గౌరవం, గుర్తింపు ఉంటాయని అనంత శ్రీరామ్ అన్నారు.

## ఆప్ పాలనలో ఢిల్లీ అభివృద్ధి

# పట్టాలు తప్పింది



## ప్రధాని నరేంద్ర మోదీ

**న్యూఢిల్లీ, (ప్రభాత సూర్యుడు):** ప్రధాని నరేంద్ర మోదీ దిల్లీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఆమ్‌ఆద్మీ ప్రభుత్వంతో దిల్లీ ప్రజలు విసిగిపోయారని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. ప్రస్తుతం వారు దేశ రాజధానిని అభివృద్ధి బాటలో నడిపే ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. గత పదేళ్ల ఆప్ ప్రభుత్వ పాలనలో దిల్లీ అభివృద్ధి పట్టాలు తప్పిందని మండిపడ్డారు. కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్ ప్రజావ్యతిరేక పార్టీ అని దుయ్యబట్టారు. ప్రపంచంలోనే అత్యుత్తమ రాజధాని నగరంగా దిల్లీని అభివృద్ధి చేయడం భాజపాకు మాత్రమే సాధ్యమని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తమకు అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. దేశరాజధానిలో భాజపా త్వరలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని విశ్వసిస్తున్నట్లు పేర్కొన్నారు. దిల్లీ ప్రజలకు వచ్చిన ఆపదను దూరం చేయడానికి తాము నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. కొవిడ్ సమయంలో ప్రజలంతా సరైన వైద్య సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతుంటే కేజ్రీవాల్ మాత్రం అద్దాల మేడ నిర్మించుకోవడంలో బిజీగా ఉన్నారని మండిపడ్డారు. నమో భారత్ కారిడార్ ప్రారంభం.. ప్రధాని నరేంద్ర మోదీ దిల్లీ-ఘజియాబాద్-మేరఠ్ నమో భారత్ కారిడార్ ప్రారంభించారు. ఉత్తరప్రదేశ్‌లోని సాహిబాబాద్, దిల్లీలోని న్యూ అశోక్ నగర్ మధ్య నమో భారత్ ఆర్ఆర్‌టీఎస్ కారిడార్‌లో 13 కిలోమీటర్ల అదనపు సెక్షన్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలిసి సాహిబాబాద్ నుంచి న్యూ అశోక్ నగర్ వరకు ప్రయాణించారు. ఈమార్గంలో కొత్తగా ప్రారంభించిన రైలు 13 కి.మీ విభాగంలో 6కి.మీ మేర భూగర్భంలో నడవనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. నమో భారత్ రైళ్లు భూగర్భ విభాగంలో నడపడం ఇదే తొలిసారని తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యే దృష్టి.. దిల్లీ భాజపా అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా మాట్లాడుతూ.. దిల్లీ అభివృద్ధి ప్రాజెక్టుల కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 12,200 కోట్లు కేటాయించిందని అన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. రిథాలా-కుండ్లి మెట్రో పొడిగింపు, జనక్‌పురి-కృష్ణా పార్క్ మెట్రో లైన్, ర్యాపిడ్ రైల్ కారిడార్ వంటి ప్రాజెక్టులను ఆయన ప్రస్తావించారు. దిల్లీని ఎవరైనా అభివృద్ధి చేస్తే అది ప్రధాని మోదీ మాత్రమే అని అన్నారు.

# ‘హైడ్రా’ దూకుడు మళ్లీ షురూ



**హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు):** నగరంలో అక్రమ కట్టడాలపై ‘హైడ్రా’ దూకుడు కొనసాగుతోంది. మాదాపూర్ అయ్యప్ప సొసైటీలోని 100 ఫీట్ రోడ్డులో ప్రధాన రహదారికి ఆనుకుని అక్రమంగా నిర్మించిన ఐదంతస్తుల భవనాన్ని బుల్డోజర్ల సాయంతో ఆదివారం హైడ్రా సిబ్బంది కూల్చివేశారు. గతేడాది ఈ భవన యజమానులకు జీహెచ్ఎంసీ నోటీసులిచ్చింది. ఆ తర్వాత హైకోర్టు సైతం ఈ నిర్మాణం అక్రమమని తేల్చింది. స్థానికుల ఫిర్యాదు మేరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ శనివారం ఈ భవనాన్ని పరిశీలించారు. 684 గజాల స్థలంలో సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు 5 అంతస్తుల్లో భవనం నిర్మాణంలో ఉన్నట్లు గుర్తించారు. జీహెచ్ఎంసీ నోటీసులు, హైకోర్టు ఉత్తర్వులను సైతం పట్టించుకోలేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఆదివారం కూల్చివేత చర్యలు చేపట్టారు. భవనం మెయిన్ రోడ్డు పక్కనే ఉండడంతో విద్యుత్ సరఫరా నిలిపేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

### ‘హైడ్రా’ కీలక నిర్ణయం

మరోవైపు, హైడ్రా’ కమిషనర్ రంగనాథ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇకపై ప్రతి సోమవారం నగర ప్రజల నుంచి ఫిర్యాదులు, సలహాలు స్వీకరించాలని నిర్ణయించారు. బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ, తిరిగి 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. ఫిర్యాదు చేసే ముందు ప్రజలు తగిన ఆధారాలు, పూర్తి వివరాలతో రావాలని సూచించారు. దీనికి సంబంధించి ఏమైనా సందేహాలుంటే 040 - 29565758, 040 - 29560596 నెంబర్లను సంప్రదించాలన్నారు. ప్రాధాన్యతా క్రమంలో సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.



# కుప్పకూలిన కోస్ట్‌గార్డ్ హెలికాప్టర్

## ముగ్గురు సిబ్బంది మృతి

**న్యూఢిల్లీ, (ప్రభాత సూర్యుడు):** ఇండియన్ కోస్ట్‌గార్డ్‌కు-ఐసీజీ చెందిన హెలికాప్టర్ ఒకటి గుజరాత్‌లోని పోర్‌బందర్ తీరంలో కుప్పకూలింది. ఈ ప్రమాదంలో ఇద్దరు పైలట్లు సహా ముగ్గురు సిబ్బంది మృతి చెందారు. కోస్ట్‌గార్డ్ గార్డ్ ఎయిర్ ఎన్‌క్లేవ్‌లో ఇది కూలిపోయినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని ఐసీజీ అధికారులు ప్రకటించారు. ఈ హెలికాప్టర్ ప్రయాణం మొదలుపెట్టాక సాంకేతిక సమస్యలను ఎదుర్కొంది. ఆ తర్వాత కొద్దిసేపటికే అది కూలిపోయింది. దీనిపై కోస్టు గార్డు ఇప్పటికే దర్యాప్తు చేపట్టింది. ఇప్పటికే ఏఎల్‌హెచ్(అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్) హెలికాప్టర్లలో కీలకమైన రక్షణ చర్యలకు హిందూస్థాన్ ఏరోనాటికల్ సంస్థ ఇప్పటికే చర్యలు చేపట్టింది. గతేడాది కూడా ఈ శ్రేణికి చెందిన హెలికాప్టర్లు ప్రమాదాలకు గురయ్యాయి. డిజైన్ సమస్యలు ఉండటం వల్ల చాలా చోట్ల వీటిని వాడటం లేదు. గతేడాది మార్చి 8న నౌకాదళానికి చెందిన ఏఎల్‌హెచ్ ధ్రువ్ ముంబయి తీరంలో ప్రమాదానికి గురైంది. అందులోని ముగ్గురుని నేవీ పెట్రోలింగ్ ఎయిర్‌క్రాఫ్ట్‌తో రక్షించారు. ఈ ఘటన తర్వాత ఏఎల్‌హెచ్ హెలికాప్టర్ల వినియోగాన్ని త్రివిధ దళాల్లో నిలిపివేశారు. కొన్నాళ్లకు సైన్యం వీటి సేవలను పునరుద్ధరించింది. అనంతరం కొన్నాళ్లకే మరో హెలికాప్టర్ కూలిపోయింది. అప్పుడు నాడు సాంకేతిక లోపం తలెత్తడం వల్ల జమ్ముకశ్మీర్‌లోని కిశ్త్వాడ్ జిల్లా అటవీ ప్రాంతంలో అత్యవసరంగా దించేందుకు ప్రయత్నిస్తుండగా ఈ హెలికాప్టర్ కుప్పకూలింది. ఆ ఘటనలో తెలంగాణకు చెందిన టెక్నికల్ నిపుణుడు పబ్బల్ల అనిల్(29) మృతి చెందారు.

# పెళ్లికాని జంటలకు ఇకపై నో రూమ్

మొదటి పేజీ తరువాయి...

అమల్లోకి వచ్చే కొత్త మార్గదర్శకాలు పరిచయం చేసింది. అందులో భాగంగా ఇకపై పెళ్లికాని జంటలు రూమ్ బుక్ చేసుకునేందుకు వీలుండదు. ఈ నిబంధనలు తొలుత మేరఠ్ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ విషయాన్ని కంపెనీ ఆదివారం వెల్లడించింది. ఓయో సవరించిన పాలసీ ప్రకారం.. ఇకపై పెళ్లికాని జంటలకు రూమ్‌లు ఇవ్వరు. కొత్త చెక్-ఇన్ పాలసీ ఆధారంగా.. ఇకపై ఆన్‌లైన్‌లో లేదా ఆఫ్‌లైన్‌లోనైనా రూమ్ బుకింగ్ సమయంలో అన్ని జంటలు పెళ్లి చెల్లుబాటు అయ్యే రుజువును సమర్పించాల్సి ఉంటుంది. అంటే కచ్చితంగా పెళ్లిని నిర్ధరించే ఐడీ ప్రూఫ్ చూపించాల్సి ఉంటుంది. ఏదైనా సందర్భంలో ఇలాంటి బుకింగ్‌లను తిరస్కరించే విచక్షణాధికారాన్ని ఓయో తన భాగస్వామి హోటళ్లకు అందించింది. మేరఠ్‌లోని తన భాగస్వామ్య హోటళ్లలో తక్షణమే దీన్ని అమల్లోకి తీసుకురావాలని నిర్దేశించింది. గ్రౌండ్ ఫీడ్‌బ్యాక్ ఆధారంగా కంపెనీ దీన్ని మరిన్ని నగరాలకు విస్తరించే అవకాశం ఉందని సంబంధిత వ్యక్తులు తెలిపారు. మీరూ కావచ్చు.. ఓ మస్క్.. ఓ జుకర్ బర్గ్. ఓయో సురక్షితమైన, బాధ్యతాయుతమైన ఆతిథ్య పద్ధతులను అమలు చేసేందుకు కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఓయో నార్త్ ఇండియా రీజియన్ హెడ్ పవాస్ శర్మ అన్నారు. కుటుంబాలు, విద్యార్థులు, ఒంటరిగా ప్రయాణం చేసేవారికి సురక్షితమైన వసతులు అందించే బ్రాండ్‌గా నిలవాలని ఓయో భావిస్తోంది. అందులో భాగంగానే తాజాగా కొత్త చెక్ -ఇన్ పాలసీ తీసుకొచ్చింది. కస్టమర్ల విశ్వాసం పెరిగి, బుకింగ్లు పెరిగేందుకు ఈ నిర్ణయం ఉపయోగపడుతుందన్నారు. అయితే వ్యాలిడ్ ప్రూఫ్‌గా ఏయే పత్రాలు చూపించాలనేదానిపై స్పష్టత ఇవ్వలేదు.

# డిప్యూటీ సీఎం కాన్వాయ్‌కి ప్రమాదం

## అదుపు తప్పి పోలీస్ వాహనం బోల్తా

**హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు):** డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వరంగల్ పర్యటనలో ప్రమాదం చోటు చేసుకుంది.. కాన్వాయ్ లో ఉన్న పోలీస్ వాహనం అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఆదివారం ( జనవరి 5, 2025 ) జరిగిన ఈ సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలిలా ఉన్నాయి. జనగామ లోని పెంబర్తి కళాతోరణం వద్ద చోటు చేసుకుంది ప్రమాదం. ఈ ఘటనలో జనగామ ఎస్ఐ చెన్నకేశవులు, డ్రైవర్లకు స్వల్ప గాయాలైనట్లు తెలుస్తోంది. ప్రమాదంలో ప్రాణాపాయం తప్పడంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు. ఇదిలా ఉండగా.. భట్టి వరంగల్ పర్యటన నేపథ్యంలో ఉద్రిక్తత నెలకొంది.. భట్టిని కలిసి రైతు భరోసా అమలుపై వినతి పత్రం ఇవ్వడానికి అనుమతి ఇవ్వాలని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి డిమాండ్ చేయటంతో..ఆయనను ఆఫీసులో ఉంచి తాళం వేశారు పోలీసులు.

## జాతీయ రాజకీయాల్లో తెలుగువారి పాత్ర

# సన్నగిల్లింది



మొదటి పేజీ తరువాయి...


అందించారు. ఆ తర్వాత నారా చంద్రబాబు నాయుడు కంప్యూటర్ యుగాన్ని ముందుకు తీసుకెళ్లారు. ఐటీని వేగంగా అభివృద్ధి చేసే ముఖ్యమంత్రిగా నిర్ణయాలు తీసుకోవడంతో ఈరోజు ఈ ప్రాంతమంతా అత్యంత ఆధునిక సాంకేతిక నైపుణ్యంతో అభివృద్ధి జరుగుతోంది. ఈ అభివృద్ధి ప్రపంచంతోనే పోటీ పడే విధంగా మనకు అవకాశాలు కల్పిస్తోంది. ఆర్థికంగా అభివృద్ధిపథం వైపు నడిచేందుకు ఉపయోగపడుతోంది. అందుకు కొనసాగింపుగా వైఎస్ఆర్ హయాంలో.. ఓఆర్ఆర్, అంతర్జాతీయ విమానాశ్రయం, ఐటీ, ఫార్మా రంగాల్లో పెట్టుబడులతో మరింత ముందుకు తీసుకెళ్లారు. తెలంగాణ ఆదాయంలో 65 శాతం ఆదాయం హైదరాబాద్ నుంచే వస్తోంది. అందుకు కారణం ఆనాటి ముఖ్యమంత్రులు తీసుకున్న నిర్ణయాలు. దేశ రాజకీయాల్లో నీలం సంజీవరెడ్డి, పీవీ నరసింహారావు, నందమూరి తారక రామారావు ఎంతో కీలకంగా వ్యవహరించారు. ఆ తర్వాత వెంకటస్వామి, జైపాల్‌రెడ్డి, వెంకయ్యనాయుడు జాతీయ రాజకీయాల్లో ప్రభావం చూపించారు. రెండు.. మూడు తరాలకు మధ్య చంద్రబాబు నాయుడు, వైఎస్ఆర్ ప్రభావం చూపించినా.. ప్రస్తుతం జాతీయ రాజకీయాల్లో తెలుగువారి పాత్ర సన్నగిల్లింది. సీజేఐగా జస్టిస్ ఎన్వీ రమణ, ఉప రాష్ట్రపతిగా ఎం.వెంకయ్యనాయుడు, ఉత్తమ పార్లమెంటేరియన్ గా జైపాల్‌రెడ్డి రాణించిన సందర్భాల నుంచి.. చట్టసభల్లో ఎవరైనా తెలుగు వారు మాట్లాడుతారా చూద్దామని ఎదురుచూసే పరిస్థితి నెలకొంది. దేశంలో ఉత్పత్తి అవుతున్న బల్క్ డ్రగ్‌లో 35 శాతం మన హైదరాబాద్ నుంచి తెలుగువాళ్లే ఉత్పత్తి చేస్తున్నారంటే ఇది మనందరికీ గర్వకారణం” అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# ఏడాదిలో 55,143 ఉద్యోగాలు

మొదటి పేజీ తరువాయి...

రికార్డు. పదేళ్లలో పేరుకుపోయిన ఖాళీలను భర్తీ చేస్తూ ఇప్పుడు ఉద్యోగాలు ఇస్తున్నాం. దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలబడింది. గతంలో ఎన్నడూ 563 గ్రూప్ 1 ఉద్యోగాలు ఇవ్వలేదు. 14 ఏళ్లుగా వీటి నియామకాలు చేపట్టలేదు. ఇన్ని ఉద్యోగాలు ఇవ్వడం ఇష్టం లేక అడ్డుకునే కుట్ర చేశారు. గ్రూప్ 1పై కుట్రలన్నీ ఛేదించి పరీక్షలు నిర్వహించాం. ఈ విషయంలో కోర్టులు ప్రభుత్వానికి అండగా నిలిచాయి. మార్చి 31 లోపు ఈ నియామకాలు పూర్తి చేస్తాం.” అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



# 6 వరుసలుగా హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి

## అప్పటి నుంచే పనులు ప్రారంభం

**హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు):** మే మొదటి వారంలో 6 వరుసలుగా హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనులు ప్రారంభిస్తామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఇప్పటికే 17 బ్లాక్ స్పాట్లు గుర్తించామని, బ్లాక్ స్పాట్ల వద్ద పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. రోడ్డు భద్రత నియమాలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవంలో భాగంగా నల్గొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తి చౌరస్తాలోని దాబాలో డ్రైవర్లకు కంటి పరీక్షల శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కంటి పరీక్ష శిబిరాన్ని మంత్రి కోమటిరెడ్డి ప్రారంభించారు. లారీ డ్రైవర్లకు కంటి పరీక్షలు చేయించి, వారికి ఉచితంగా కళ్ల జోళ్లను పంపిణీ చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, సీట్ బెల్ట్ ధరించాలని, కళ్ల సమస్యలు ఉన్నవారు తరచూ పరీక్షలు చేయించుకోవాలని మంత్రి కోమటిరెడ్డి సూచించారు.

# వైకుంఠ ద్వార దర్శనానికి నిర్దేశిత సమయంలోనే అనుమతిస్తాం

**తిరుమల (ప్రభాత సూర్యుడు):** వైకుంఠ ద్వార దర్శన రోజుల్లో భక్తులు వేచి ఉండే సమయాన్ని నివారించేందుకు టోకెన్లు, టికెట్లపై నిర్దేశించిన సమయం ప్రకారం మాత్రమే భక్తులను దర్శనాలకు అనుమతిస్తామని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు పునరుద్ఘాటించారు. ఆదివారం ఉదయం తిరుమలలోని శ్రీవారి ఆలయ మాఢవీధుల్లో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లను బీఆర్ నాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మీడియాతో మాట్లాడుతూ.. భక్తులు సంయమనం పాటించి తిరుపతిలో జారీ చేయనున్న ఎస్ఎస్డీ టోకెన్లు పొందాలని కోరారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈసారి వైకుంఠ ఏకాదశికి అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసేందుకు టీటీడీ యంత్రాంగం విశేష కృషి చేస్తోందని పేర్కొన్నారు.

### వైకుంఠ ద్వార దర్శనం టికెట్లు ఎలా పొందాలంటే..

జనవరి 10వ తేదీ నుంచి 19వ తేదీ వరకు పది రోజుల పాటు తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనానికి అనుమతించనున్నారు. వైకుంఠ ద్వార దర్శనానికి ఆన్‌లైన్‌లో టికెట్లను పొందని భక్తులకు నేరుగా తిరుమల, తిరుపతిలో ఎస్ఎస్డీ టికెట్లు ఇచ్చేలా టీటీడీ ఏర్పాట్లు చేసింది. జనవరి 10, 11, 12వ తేదీలకు సంబంధించి జనవరి 9వ తేదీన ఉదయం 5 గంటల నుంచి 1.20 లక్షల టోకెన్లు జారీ చేయనున్నారు. ఇందుకోసం తిరుపతిలోని 8 కేంద్రాలలో 90 కౌంటర్లు, తిరుమలలో 4 కౌంటర్లు కలుపుకుని మొత్తం 94 కౌంటర్లలో టోకెన్లు ఇవ్వనున్నారు.
తిరుపతిలో ఇందిరా మైదానం, రామచంద్ర పుష్కరిణి, శ్రీనివాసం కాంప్లెక్స్, విష్ణునివాసం కాంప్లెక్స్, భూదేవి కాంప్లెక్స్, భైరాగిపట్టెడలోని రామానాయుడు ఉన్నత పాఠశాల, ఎంఆర్ పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జీవకోనలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అదేవిధంగా తిరుమల స్థానికుల కోసం తిరుమల బాలాజీ నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాట్లు చేశారు. జనవరి 13 నుంచి 19వ తేదీ వరకు ఏరోజుకారోజు ముందు రోజు టోకెన్లను తిరుపతిలోని భూదేవి కాంప్లెక్స్, శ్రీనివాసం, విష్ణు నివాసంలలో మాత్రమే టోకెన్లు జారీ చేయనున్నారు.





# ప్రజాకాంక్షలకు వ్యతిరేకంగా పని చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

## బీజేఎల్పీ నేత ఏలేటి

**హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు):** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ఆకాంక్షలకు వ్యతిరేకంగా పని చేస్తున్నదని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్ర మంత్రివర్గం శనివారం తీసుకున్న నిర్ణయాలు నిరాశ పరిచాయని ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో చెప్పారు. రైతులకు పెట్టుబడి సాయం కింద రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనున్న రైతు భరోసాపై స్పష్టత లేదన్నారు. పెన్షన్ పెంపు, ఆరు గ్యారంటీలను పట్టించుకోకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం అని ఆరోపించారు. రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయాలు కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు ఉన్నాయని చెప్పారు. తాను లేవనెత్తిన పలు అంశాలపై స్పందించక పోవడం ప్రభుత్వం తప్పు చేసిందనే దానికి నిదర్శనం అని ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. రాష్ట్ర రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కంపెనీ వ్యవహారంలో ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరవాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్ లిఫ్ట్ టెండర్లలో గోల్ మాల్ సంగతేమిటని నిలదీశారు. ఈ అన్ని అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పోరాడుతామని, రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తాం అని స్పష్టం చేశారు.



# సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల పోరాటానికి బీఆర్ఎస్ అండ

## ఎమ్మెల్సీ కవిత

**హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు):** రాష్ట్రవ్యాప్తంగా 19,600 సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు గత 26 రోజులుగా సమ్మె చేస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. కుటుంబాలతో సహా రోడ్లపై నిరసన తెలియజేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులతో ముఖ్యమంత్రి, మంత్రులు కనీసం చర్చించకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు హామీ ఇచ్చారని ఎమ్మెల్సీ కవిత తెలిపారు. ఇప్పుడు మాత్రం అది కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన అంశమని, నిరసనలు కొనసాగిస్తే, సమస్య తీవ్రమవుతుందని బెదిరింపు ధోరణిలో మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. రేవంత్ వైఖరిని ఆమె తీవ్రంగా ఖండించారు. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు.



# 'విశాఖకు భారీగా ఐటీ కంపెనీలు'

## వైసీపీ కుంభకోణాలపై త్వరలోనే యాక్షన్ ఉంటుందన్న మంత్రి లోకేశ్

**అమరావతి, (ప్రభాత సూర్యుడు):** ఐదేళ్ల వైసీపీ పాలనలో ఉత్తరాంధ్ర కోసం జగన్ చేసిందేమీ లేదని.. కనీసం రైల్వే జోన్‌కు భూమి కూడా ఇవ్వలేదని, ఒక్క ఐటీ కంపెనీ తీసుకురాలేదని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ధ్వజమెత్తారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో విశాఖ కలెక్టరేట్‌లో సమీక్ష అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. '2014 నుంచి ఎన్డీయే ప్రభుత్వ నినాదం ఒకే రాష్ట్రం - ఒకే రాజధాని - అభివృద్ధి వికేంద్రీకరణ. ఇందులో భాగంగా దాదాపు 5 కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాం. ఇప్పటికే పూర్తైన ప్రాజెక్టులను ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. రైల్వే జోన్ అందరి కల. జోనల్ హెడ్ క్వార్టర్ విశాఖలో ఉండాలని ఉత్తరాంధ్ర ప్రజలు కోరుకుంటున్నారు. హెడ్ క్వార్టర్ ఏర్పాటు చేసేందుకు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. ఇవే కాకుండా రైల్వేకు సంబంధించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నారు.' అని పేర్కొన్నారు. విశాఖను ఐటీ కేంద్రంగా తీర్చిదిద్దుతామని.. ప్రస్తుత పెట్టుబడుల ద్వారా దాదాపు లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని లోకేశ్ తెలిపారు. 'విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదు. తప్పుడు ప్రచారాలు మానుకోవాలి. వైసీపీ ఫేక్ పార్టీ. ఉత్తరాంధ్రకు వైసీపీ ఐదేళ్లలో ఏం చేసింది?. ఒక్క ఐటీ కంపెనీ తీసుకురాలేదు. ఉన్న కంపెనీలు వెళ్లిపోయాయి. టీసీఎస్ మేం తీసుకువచ్చాం. రుషికొండ తప్ప వైసీపీ హయాంలో ఉత్తరాంధ్రకు చేసిందేమీ లేదు. మేం డేటాసెంటర్ తీసుకువస్తే మహారాష్ట్రకు తరిమేశారు. లులూ తరిమేశారు. హెచ్ఎస్‌బీసీ మూతపడింది. హుద్ హుద్, తిత్లీ తుఫాను, విజయవాడ వరదల సమయంలో సాయం ప్రకటించిన జగన్ రెడ్డి.. ఆ నిధులు ఎక్కడ ఖర్చు చేశారో చెప్పాలి. రాష్ట్ర సమగ్రాభివృద్ధి మా నినాదం.' అని అన్నారు.

# రెసిడెన్షియల్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన డిప్యూటీ సీఎం భట్టి



**యాదాద్రి భువనగిరి (ప్రభాత సూర్యుడు):** విద్యార్థుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం డైట్, కాస్మోటిక్ ఛార్జీలను పెంచిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం మధ్యాహ్నం ఆయన హైదరాబాద్ నుంచి వరంగల్ వెళుతూ మార్గమధ్యంలో బీబీనగర్‌లోని ఎస్సీ, బీసీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న మెనూ, కాస్మోటిక్ ఛార్జీల వివరాలను విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి ఆయన మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందితేనే వారు శారీరకంగా, మానసికంగా బలంగా ఎదుగుతారన్నారు. ఎదిగే సమయంలో కావాల్సిన పోషకాలు అందిస్తేనే మెదడు చురుకుగా పనిచేసి టీచర్లు బోధించే పాఠాలను పూర్తిస్థాయిలో అర్థం చేసుకుంటారని వివరించారు. క్యాబినెట్ సహచరులు మొదలు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు తరచూ రెసిడెన్షియల్ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలను సందర్శించి అందుతున్న సౌకర్యాలపై నిరంతరం పర్యవేక్షణ చేస్తారని తెలిపారు.

# బుద్వేల్ రైల్వే స్టేషన్ దగ్గర భారీ అగ్ని ప్రమాదం

## మెకానిక్ షెడ్లు పూర్తిగా దగ్ధం



**హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు):** రంగారెడ్డి జిల్లా మైలార్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది.. జిల్లాలోని బుద్వేల్ రైల్వే స్టేషన్ వద్ద లారీ పార్కింగ్‌లో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఆదివారం (జనవరి 5, 2025) చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలిలా ఉన్నాయి. రైల్వే స్టేషన్ దగ్గర ఉన్న లారీ పార్కింగ్ లో షార్ట్ సర్క్యూట్ అవ్వడంతో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో మెకానిక్ షెడ్లు పూర్తిగా దగ్ధమైనట్లు తెలుస్తోంది. ఘటనాస్థలి దగ్గర భారీగా ఎగసి పడుతున్న మంటలు ఎగసి పడుతున్నాయి. మంటలకు తోడు గాలి కూడా ఎక్కువగా వీస్తుండటంతో దట్టమైన పొగ అలుముకుంది.. షార్ట్ సర్క్యూట్‌తో ఒకసారిగా మంటలు చెలరేగి మెకానిక్ షెడ్లు పూర్తిగా దగ్ధమయ్యాయని స్థానికులు తెలిపారు. స్థానికులు వెంటనే సమాచారం అందించటంతో అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలు అదుపులోకి తెచ్చారు.ఈ ఘటనలో సుమారు రూ.10 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించి ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.



# మేడ్చల్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

## బైక్‌ను ఢీ కొట్టిన లారీ ముగ్గురు మృతి

**మేడ్చల్ మల్కాజిగిరి (ప్రభాత సూర్యుడు):** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. బైక్‌ను లారీ ఢీ కొట్టడంతో కూతురు సహా భార్య భర్తలు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ విషాదకర సంఘటన మేడ్చల్ చెక్‌పోస్ట్ వద్ద ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే ఓ కుటుంబం బైక్‌పై వెళ్తుండగా లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో దంపతులతో పాటు కూతురు మృతి చెందింది. ఈ ప్రమాదంలో వారి కుమారుడి కాళ్లపై నుంచి లారీ వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే బాలుడిని హాస్పిటల్‌కు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

## సంపాదకీయం EDITORIAL

# లాలూతో కలవడం పొరపాటే..

### తెగేసి చెప్పిన బీహార్ సీఎం నితీశ్ కుమార్..!



బీహార్ సీఎం నితీశ్ కుమార్ ఆదివారం కీలక వ్యాఖ్యలు చేశారు. నితీశ్ కుమార్‌కు తమ తలుపులు తెరిచే ఉన్నాయని ఆర్జేడీ అధినేత, మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్ చేసిన వ్యాఖ్యపై జేడీయూ సీనియర్ నేత నితీశ్ స్పందించారు. మళ్లీ లాలూ ప్రసాద్ యాదవ్‌తో కలిసే ప్రసక్తి లేదన్నారు. మళ్లీ ఆ పొరపాటు చేయబోనని చెప్పారు. గతంలో 2014 ఎన్నికల తర్వాత, 2020 తర్వాత రెండు దఫాలు ఆర్జేడీ సారథ్యంలోని గ్రాండ్ అలయెన్స్‌లో జనతాదళ్ యూ నేత నితీశ్ కుమార్ జత కట్టారు. కానీ కూటమి పక్షాల మధ్య విభేదాలతో ఆయన తిరిగి బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏలో చేరారు. 'పవర్ కోసం ఎవరైనా ఏమైనా చేస్తారు. కానీ సూర్యాస్తమయం తర్వాత ఇంటి నుంచి బయటకు రావడానికి భయ పడతారు. వారితో పలుసార్లు కలిసి పొరపాటు చేశాను'అని నితీశ్ కుమార్ ఆదివారం మీడియాతో చెప్పారు. త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో నితీశ్ కుమార్ తమ సీఎం అభ్యర్థి అని కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్‌షా ప్రకటించిన తర్వాత లాలూ ప్రసాద్ యాదవ్.. నితీశ్ కుమార్‌కు మహా కూటమి తలుపులు తెరిచే ఉన్నాయని వ్యాఖ్యానించడం ప్రాధాన్యం సంతరించుకున్నది. గత ఏప్రిల్-జూన్ నెలల్లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజారిటీకి బీజేపీ కొద్ది దూరంలో నిలిచింది. ప్రస్తుతం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి నితీశ్ కుమార్ సారథ్యంలోని జేడీయూ, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు సారథ్యంలోని టీడీపీ మద్దతు కీలకంగా మారింది.

# సినిమాను రాజకీయాల్లోకి లాగిందెవరు?



రెండు మూడు రోజుల క్రితం ఒక తెలుగు సినిమా రంగ ప్రముఖుడు మాట్లాడుతూ.. సినిమాను రాజకీయాల్లోకి లాగొద్దని, కేటీఆర్ వ్యాఖ్యలు తనను బాధించాయని సెలవిచ్చారు. అల్లు అరెస్ట్ ఉదంతం, ఆ తర్వాతి పరిణామాలు, దానిచుట్టూ జరిగిన రాజకీయ సంవాదాలు గమనిస్తే సదరు ప్రముఖుడి మాటలు విడ్డూరంగా అనిపిస్తాయి. ప్రజలకు ఏమీ తెలియదని, తాము ఎంత చెప్తే అంతే అనుకుంటారని, ప్రజల జ్ఞాపకశక్తి స్వల్పమని అనుకుంటారేమో తెలియదు. కాబట్టి తమను రాజకీయాల్లోకి లాగవద్దని ఓ ప్రకటన ఇచ్చేశారు. ఆయన ప్రకటనలోని బేలతనాన్ని కాసేపు పక్కన పెడితే, ఈ సందర్భంగా అసలు సినిమాను రాజకీయాల్లోకి లాగిందెవరన్న ప్రశ్న ఉదయించక తప్పదు. ప్రత్యేకించి ఏపీ నుంచి నేటి వరకు సినిమాను రాజకీయం లాగిందా? లేదంటే రాజకీయమే సినిమాను లాగిందా? అన్నది ప్రశ్న.

సినీ రాజకీయాల కోసం, అసలు రాజకీయాలను ఆలంబనగా చేసుకుని మనుగడ సాగించిదెవరన్న విషయం చర్చకు వస్తుంది. ఈ వ్యాసం ఎవరినో కించపరచాలనో, లేదంటే జరిగిన, జరుగుతున్న పరిణామాలకు ఏ ఒక్కరినో బాధ్యుల్ని చేయాలనో కాదు. సమకాలీనంగా జరుగుతున్న అంశాలకు సంబంధించి చరిత్ర, వర్తమాన ప్రభావాలు ఎలా ఉన్నాయని చెప్పడమే దీని ఉద్దేశం. స్వర్గీయ మహానటుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ మొదలు నేటి పవన్‌కల్యాణ్ వరకు సినీరంగ రాజకీయ ప్రవేశం గురించిన విషయాలు సినిమాను రాజకీయంలోకి లాగిందెవరో విడమరచి చెప్తాయి. తమిళనాట సినిమా నటుల ప్రభావం రాజకీయాలపై గణనీయంగా ఉండేది. తెలుగునాట ఆ సంస్కృతి ఎన్టీఆర్‌తో బలంగా ప్రవేశించిందని అనడంలో అతిశయోక్తి లేదు. తెలుగు వారి ఆత్మగౌరవ పరిరక్షణ, ఢిల్లీ పెత్తనంపై చేసిన తిరుగుబాటును ప్రజలు స్వాగతించారు, ఆదరించారు. అక్కున చేర్చుకుని అధికారం అందించారు. రాజకీయ పార్టీ స్థాపించిన అతి తక్కువ కాలంలోనే తిరుగులేని ప్రజా నాయకుణ్ణి చేశారు. అయితే ఆ విజయానికి, అధికార అందలానికి దారులు పరచిన పెట్టుబడి మాత్రం సినీ గ్లామరే. ఆయన ఎన్నుకున్న అంశాలు ఇతరులెందరు ఎత్తుకున్నా ఆయన లాంటి విజయాన్ని అంత త్వరగా సాధించలేకపోయారనేది వాస్తవం.

రాముడిగా, కృష్ణుడిగా, పౌరాణిక పాత్రలే కాక, సాధారణ గ్రామీణ యువకుడి నుంచి జమీందారుగా, తెరపై ఏ పాత్రవేసినా ఆయన చూపించిన విలక్షణత తెలుగు ప్రజల మనసుల్లో ఒక బలమైన ముద్రవేసుకొని పోయింది. ఒక మహెూన్నతుడనే భావనను కలిగించింది. అదే భావన ఆయన రాజకీయ రంగప్రవేశం, విజయాలకు సోపానమైంది. సినిమాను, దాని ద్వారా వచ్చిన ప్రతిష్ఠను ప్రజల భావోద్వేగాలతో రంగరింపచేయడం ద్వారానే ఆయన ముఖ్యమంత్రి స్థానానికి చేరగలిగారనేది నిర్వివాదాంశం. రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత కూడా ఆయన ఆంగికం, వాచకం మార్చుకోలేదు సరికదా ప్రసంగాల్లో, వ్యవహారికంలో నాటకీయతను మరువలేదు. ఆ తరువాతి కాలంలో ప్రజాకర్షక పథకాలతో, జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పరిణమించిన అంశాలతో రాజకీయంగా ఉన్నతస్థానానికి చేరుకోగలిగారు. అది వేరు సంగతి. కానీ, నేటికీ ఆయనను స్మరించుకోవలసి వచ్చినపుడు తొలుత స్ఫురించేది మహానటుడు ఎన్టీఆర్ గానే.

ఎన్టీఆరే కాదు, ఆ తరువాత చిరంజీవి, పవన్‌కల్యాణ్ పాక్షిక విజయాలు అందుకున్నా, మోహన్‌బాబు, దాసరి, జయసుధ, జయప్రద, రోజా, రామానాయుడు, మురళీమోహన్, బాబూమోహన్, కోట శ్రీనివాసరావు, కైకాల, కృష్ణంరాజు, నాగబాబు, తమిళనాట విజయకాంత్, శరత్‌కుమార్, కన్నడనాట రాజ్‌కుమార్, అంబరీష్, సుమలత ఇంకా అనేకమంది నటుల రాజకీయ ప్రవేశానికి సినిమా పెట్టుబడి అయింది.

ఎన్టీఆర్ కాలంలో ఏఎన్నార్, కృష్ణలాంటి వాళ్లు రాజకీయంగా ఏదో ఒక పార్టీకి సన్నిహితంగా ఉన్నారు. కృష్ణ రాజకీయాల్లో క్రియాశీలంగా ఉన్నారు. 'నా పిలుపే ప్రభంజనం' వంటి రాజకీయమే ప్రధాన అంశంగా సినిమాల్ని తీశారు. మోహన్‌బాబు బీజేపీకి ప్రచారం చేశారు. చిరంజీవి సినిమా పాపులారిటీనే పెట్టుబడిగా పెట్టి ప్రజారాజ్యం పార్టీ స్థాపించి కేంద్రమంత్రిగా ఎదిగారు. ఆపై కాంగ్రెస్ పార్టీలో విలీనం చేశారు. పవన్ కల్యాణ్ కూడా అదే బాటలో పయనించి తెలుగుదేశం, బీజేపీ పొత్తుతో ఉప ముఖ్యమంత్రి అయ్యారు . అనేకమంది దర్శకనిర్మాతలు వివిధ రాష్ట్రాల్లో ప్రజాప్రతినిధులయ్యారు. వారందరికీ రాజకీయ రంగంలో తొలి పెట్టుబడి సినిమా పాపులారిటీనే. అదేమీ తప్పు కాదు. వివిధ రంగాల్లోఉన్నవాళ్లు ఒకస్థాయికి చేరిన తర్వాత ప్రజా జీవితంలోకి రావడానికి రాజకీయాలను ఎంచుకొన్నపుడు ఆయారంగాల్లో వారు సాధించిన పాపులారిటీనో, ప్రజామోదమో వారికి పెట్టుబడి అయింది. అయితే ఇవేవీ సినిమా పాపులారిటీకి సాటిరావు.

రాజకీయరంగ ప్రభావం లేకుండా సినిమారంగం ఎదగగలిగేదా అంటే, నిజానికి ఏ రంగానికైనా వెన్నుదన్నుగా రాజకీయ రంగం అవస రం. ఇక్కడ రాజకీయ రంగం అంటే, రాజకీ య పార్టీలే ప్రభుత్వాలను ఏర్పరుస్తాయి, ఆయా రంగాల అభివృద్ధికి విధాన నిర్ణయాలు తీసుకుంటాయి. మాజీ ముఖ్యమంత్రి చెన్నారెడ్డి చొరవ వల్ల తెలుగు సినిమా రంగం హైదరాబాద్‌కు తరలివచ్చి వేళ్లానుకుంది. పార్టీలేవైనా ఆయా ప్రభుత్వాలు, ముఖ్యమంత్రుల చొరవతో తదుపరి ప్రయాణం కొనసాగించాయి. కేసీఆర్ పదేండ్ల పాలనలో తెలంగాణలో సినిమా పరిశ్రమ దినదిన ప్రవర్ధమానంగా అభివృద్ధి చెందింది. పాన్ ఇండియా సినిమాల నిర్మాణానికి హైదరాబాద్ కేంద్రమైంది. దానికి తగ్గ అన్ని హంగులనూ కేసీఆర్ ప్రభుత్వం సమకూర్చింది. ప్రపంచం దృష్టిని ఆకర్షించి కలెక్షన్ల రికార్డులను తిరగరాసిన ఒక 'బాహుబలి', ఆస్కార్ అందించిన ఒక 'ఆర్ఆర్ఆర్', జాతీయస్థాయిలో ప్రేక్షకులను సమ్మోహితులను చేసిన 'పుష్ప' లాంటి చిత్రాలను తెలుగు సినీ పరిశ్రమ అందించింది. కేసీఆర్ హయాంలో చిన్న వివాదాన్ని కూడా సినీ పరిశ్రమ ఎరుగదు. ప్రభుత్వ ప్రమేయం, పర్యవేక్షణ అవసరం మేరకు జరిగింది. కరోనా సమయంలోనూ కేసీఆర్ ప్రభుత్వం చిత్ర పరిశ్రమకు వెన్నుదన్నుగా నిలిచింది. తెలుగు మహాసభల నుంచి అనేక వేదికలపై సందర్భోచితంగా సినీ ప్రముఖులను గౌరవించుకున్నది. ఇండస్ట్రీ అవసరాల్ని తెలుసుకొని శక్తిమేర తీరుస్తూ వచ్చింది. అనవసర ప్రమేయం, ఉద్దేశపూర్వక ఒత్తిడిని ప్రోత్సహించలేదు. సినీ ప్రముఖుల మరణాల సమయంలోనూ ప్రాంతీయ భేదాలు చూపకుండా తన బాధ్యతను నిర్వర్తించింది. ముఖ్యంగా రాజకీయ పార్టీగా బీఆర్ఎస్ సినీ పరిచయాల్ని రాజకీయంగా వాడుకోలేదు. సినిమాను రాజకీయాల్లోకి లాగలేదు.

ప్రత్యేక ఉద్యమ సందర్భం నుంచి నేటి వరకు సినిమా పరిశ్రమను ప్రాంత, భాష, యాస, భావభేదం లేకుండానే తెలంగాణ చూసింది. నటులెవరు? నిర్మాతలెవరు? దర్శకులు, ఎగ్జిబిటర్లు ఎవరనే వాటితో సంబంధం లేకుండా ఆదరించింది. సినిమాను సినిమాగా చూసింది. తెలంగాణ ఉద్యమానికి కారణమైన ఏ అంశాన్నీ సినిమా పరిశ్రమకు అన్వయించలేదు. ఆ దిశగా ఎటువంటి వివాదాలకు ఆస్కారమివ్వలేదు. తెలంగాణ ప్రాంతానికి చెందిన నటులు, కవులు, కళాకారులు కూడాఅదే పద్ధతిని అనుసరించారు తప్ప ప్రాంత పరమైన విషయాలను అవసరానికి వాడుకోలేదు. చిత్ర పరిశ్రమ గృహ నిర్మాణానికి సొంత జాగనిచ్చిన ప్రభాకర్‌రెడ్డి మొదలుకొని విలక్షణమైన విలనిజాన్ని పండించిన త్యాగరాజు, పౌరాణిక పాత్రలకు పేరుగాంచిన కాంతారావు, మాటలు, పాటల రచయితలు చంద్రబోస్, సుద్దాల అశోక్‌తేజ, మిట్టపల్లి సురేందర్, దర్శకులు శంకర్, సురేందర్‌రెడ్డి, వంశీ పైడిపల్లి, హరీశ్ శంకర్, బలగం వేణు ఇంకా అనేకమంది ఔత్సాహిక తెలంగాణ ప్రాంత నటీనటులు తెలుగు చలన చిత్రసీమకు తమశక్తిని ధారపోశారు, పోస్తున్నారు. తెలంగాణ గడ్డపై మొక్కగా స్థాపించబడి వటవృక్షాలై ఎదిగిన సారథి, అన్నపూర్ణ, రామానాయుడు, రామోజీ స్టూడియోల అభివృద్ధి ప్రస్థానాన్ని, తెలంగాణలో చిత్రపరిశ్రమ అభివృద్ధికి తలమానికం అనే భావించింది తప్ప ఇతరులవిగా భావించలేదు.

ఇక, అల్లు అరెస్టు ఉదంతానికొస్తే రాష్ట్రంలోప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ స్పందించింది. అతడి స్థానంలో మరే నటుడున్నా అలాగే స్పందించేవాళ్లం. సంధ్య థియేటర్‌లో జరిగిన దుర్ఘటనలో నేరుగా ఆయనొక్కడికే సంబంధం లేకున్నా అరెస్టు చేసిన విధానాన్ని ప్రశ్నించాం. ఇది ఒక వ్యక్తి హక్కులకు భంగం కలిగిన విధానాన్ని, ప్రభుత్వ ఏకపక్ష విధానాన్ని ప్రశ్నించిన వ్యవహారంగానే చూడాలి. చనిపోయిన మహిళ పట్ల, ఇంకా దవాఖాన లో ఉన్న శ్రీతేజ్ పట్ల బీఆర్ఎస్ సానుభూతి వ్యక్తం చేసింది, పరామర్శించింది. ప్రభుత్వ బాధ్యతను గుర్తుచేసింది. విషయ తీవ్రతను సమాజం దృష్టికి తీసుకొచ్చిన తర్వాతే ప్రభుత్వం కార్యాచరణను వేగవంతం చేసిందనేది సుస్పష్టం. కానీ, ఘటనను మాత్రమే ప్రధానంగా చూపించి నటుడిని దోషిగా చూపించి వ్యవస్థాపరమైన లోపాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేసిందెవరు? జాతీయ మీడియా మొదలుకొని అసెంబ్లీ వరకు సదరు హీరోను మాత్రమే దోషిగా చిత్రీకరించే ప్రయత్నం చేసిందెవరు? ఏ రకమైన చర్చ లేకుండా అన్ని రకాల స్పెషల్ షోలు, ప్రోత్సాహకాలను రద్దు చేస్తామని మాట్లాడి పరిశ్రమ వర్గాల్లో ఆందోళనా భావాన్ని కలిగించిందెవ రు? ఎమ్మెల్యే నుంచి అన్ని స్థాయుల నా యకులు ఇదే అంశాన్ని అడ్డుగా పెట్టుకొని రాజకీయ వ్యాఖ్య లు చేసిందెవరు? చివరికి ఈ అం శంలో ప్రాంతీయ భేదాల్ని ప్రస్తావించిందెవరు?

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి మొన్నటి చిత్ర పరిశ్రమతో సమావేశం వరకూ ఎన్నడూ ప్రభుత్వ పెద్దల సముఖానికి రాని సినీ పెద్దలు పోలోమని సమూహంగా వచ్చారంటే దయచేసి సినిమాను రాజకీయాల్లోకి లాగొద్దని విన్నవించుకోవడానికేనా? మరిప్పుడు సినిమాను రాజకీయంలోకి లాగిందెవరు? ఈ విషయాలన్నీ నేడు ప్రజల్లో ఉన్నాయి. వీటన్నింటికీ కాలం సరైన రీతిలోసరైన సమాధానం చెప్తుంది. కేటీఆర్ బాధ్యతాయుతమైన ప్రతిపక్ష పార్టీ నాయకుడిగా ఏడాది కాలం నుంచి ప్రభుత్వ తప్పుడు విధానాలను ప్రశ్నిస్తూ వస్తున్నారు. లగచర్ల గిరిజన సమస్యలైనా, ఆశా వర్కర్ల సమస్యలైనా, తెలంగాణ అస్తిత్వ అంశమైనా, ప్రతి వర్గానికి అండగా ఉండే ప్రయత్నం చేస్తున్నారు. అల్లు అర్జున్ విషయంలోనూ ప్రతిపక్షంగా హక్కులు, నిర్బంధం గురించే మాట్లాడారు తప్ప రాజకీయం చేయలేదు. విజ్ఞులమనుకొని కువిమర్శలు చేసే పెద్ద మనుషులు ఈ విషయం గమనిస్తే మంచిది. ప్రతిపక్ష బాధ్యత నిర్వహణను సదరు వ్యక్తులు గుర్తెరిగి మాట్లాడితే మంచిది. కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు. మారుతూ ఉంటుంది. స్థానాలు, బాధ్యతలు మారుతుంటాయనే వాస్తవం గ్రహిస్తే మంచిది.అందువల్ల అర్థం కావలసిన విషయం ఏమంటే%% సినిమాను బీఆర్ఎస్ పార్టీ రాజకీయాల్లోకి లాగలేదు, లాగే అవసరమూ లేదు.



# నో డిటెన్షన్‌పై మన వైఖరి ఏమిటి?

డిటెన్షన్ విధానం అంటే పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఉచిత, నాణ్యమైన, సమానమైన విద్య అందించడంలో భాగమేనా? ఒక్కసారి ఆలోచించాలి. 2009 విద్యాహక్కు చట్టాన్ని సవరిస్తూ కేంద్రం ఇప్పటివరకు అమలులో ఉన్న నో డిటెన్షన్ విధానాన్ని రద్దు చేస్తూ, 5, 8 తరగతుల్లో విద్యార్థులకు డిటెన్షన్ విధానాన్ని తీసుకువచ్చింది. విద్యా హక్కు చట్టం 2009 సెక్షన్ 16 ప్రకారం బడిలో ప్రవేశం పొందిన బాలలను ఎలిమెంటరీ విద్య పూర్తయ్యే వరకు బడి నుంచి తొలగించకూడదు. సెక్షన్ 30 ప్రకారం ఎలిమెంటరీ విద్య పూర్తయ్యేవరకు పిల్లలు బోర్డు పరీక్షలు రాయాల్సిన అవసరం లేదు.నో డిటెన్షన్: 1 నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులను ఫెయిల్ చేయడం కానీ, స్కూల్ నుంచి బహిష్కరించడం కానీ చేయకూడదు. ఇదే ఇప్పటివరకు కొనసాగుతున్న నో డిటెన్షన్ విధానం. విద్యార్థులు ఒకటి నుంచి 8వ తరగతి వరకు పూర్తి చేసుకునే వరకు ఆటోమేటిక్‌గా పై తరగతులకు ప్రమోట్ అవుతారు. వీరికి పరీక్షలు నిర్వహించినప్పటికీ గ్రేడ్స్ ఇచ్చి పై తరగతులకు ప్రమోట్ చేస్తారు. ఎవరినీ ఫెయిల్ చేయరు. అదే నో డిటెన్షన్ పాలసీ. కానీ ప్రస్తుతం దీనిని రద్దు చేయడం వల్ల 5, 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షలు నిర్వహించాలి. వారు ఉత్తీర్ణులు కాకుంటే తిరిగి రెండు నెలల్లో పరీక్షలు నిర్వహించాలి. అప్పుడు ఉత్తీర్ణులు అయితేనే పై తరగతికి ప్రమోట్ అవుతారు. కాకుంటే వారు అదే తరగతులు తిరిగి చదవాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ పాఠశాలలు, సైనిక పాఠశాలలతో కలిపి దేశవ్యాప్తంగా 3 వేల విద్యా సంస్థల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి డిటెన్షన్ విధానం అమల్లోకి రానున్నది. దీనిని తిరోగమన చర్యగా చెప్పొచ్చు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులు ప్రాథమిక విద్యకు దూరమయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఫెయిల్ అయిన విద్యార్థులు బడికి దూరమయ్యే ప్రమాదం ఉన్నది. తిరిగి అదే తరగతి చదవాల్సి రావడం వల్ల వారిలో న్యూనతాభావం ఏర్పడే అవకాశం ఉన్నది. బాల కార్మికులు పెరిగే ప్రమాదం ఉన్నది. పేద విద్యార్థుల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ప్రాథమిక విద్యపై దృష్టి పెట్టాలి. విద్యా వ్యవస్థలో అవసరమైన మార్పులు తీసుకురావాలి. పరీక్ష విధానంలో సంస్కరణలు తీసుకురావాలి.నేర్చుకోవడానికి ఇబ్బంది పడుతున్న విద్యార్థులకు ప్రోత్సాహాన్ని అందించాలి. విద్యార్థులకు మౌలిక వసతులు, అభ్యసనకు అనువైన ఆహ్లాదకర వాతావరణం, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు, తరగతి గదులు, కనీస సౌకర్యాలు కల్పించడానికి కృషి చేయాలి.

# పూరీ జగన్నాథ ఆలయంపై ఎగిరిన డ్రోన్.. కలకలం రేపిన ఘటన

ఒడిశాలోని పూరీలో ఉన్న ప్రసిద్ధ జగన్నాథ ఆలయంపై డ్రోన్ ఎగిరింది. సుమారు అరగంట పాటు అక్కడ తిరిగింది. దీంతో ఈ సంఘటన కలకలం రేపింది. ఈ నేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆదివారం ఉదయం తెల్లవారుజామున 4.10 గంటల సమయంలో పూరీలోని జగన్నాథ ఆలయంపై డ్రోన్ ఎగిరింది. దానికి అమర్చిన కెమెరాలో ఆలయాన్ని చిత్రీకరించింది. కాగా, నో ఫ్లైయింగ్ జోన్ ప్రాంతమైన జగన్నాథ ఆలయంపై డ్రోన్ ఎగురడం కలకలం రేపింది. భద్రతా లోపాలపై ఆందోళనకు దారి తీసింది. న్యాయ శాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ ఈ సంఘటనపై స్పందించారు. జగన్నాథ ఆలయంపై డ్రోన్ ఎగురవేయడం చట్టవిరుద్ధమని, ఆమోదయోగ్యం కాదని అన్నారు. భద్రతా ఉల్లంఘనకు పాల్పడిన వారిని గుర్తించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరుగకుండా ఆలయం చుట్టూ ఉన్న నాలుగు వాచ్‌టవర్ల వద్ద 24 గంటలపాటు పోలీస్ సిబ్బందిని మోహరించే చర్యలు చేపడతామని అన్నారు. మరోవైపు పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేశారు. దర్యాప్తు కోసం పోలీస్ బృందాలను ఏర్పాటు చేసినట్లు పూరీ ఎస్పీ వెల్లడించారు. ఎవరో యూట్యూబర్ ఈ చర్యకు పాల్పడి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు.

# బీసీలకు కుల గణనతోనే న్యాయం

**భారతదేశ సామాజిక ముఖచిత్రం కులం పునాదిగా ఏర్పడింది. ఈ నేపథ్యంలో అన్ని కులాలకు, తరగతులకు సమాజంలోని వివిధ వర్గాల మధ్య తీవ్ర అసమానతలను తగ్గించి, బలహీన వర్గాల సామాజిక, ఆర్థిక జీవన ప్రమాణాలను పెంచేందుకు ప్రభుత్వాలను భారత రాజ్యాంగం నిర్దేశిస్తున్నది.**

ఇందులో భాగంగానే ప్రాతినిధ్యం లేని, లేదా తక్కువగా ఉన్న వివిధ కులాలకు, తరగతులకు అవకాశాలు కల్పించేందుకు అనేక మార్పులను, చర్యలను ప్రభుత్వాలు తీసుకుంటూ వస్తున్నాయి. అనేక రకాలైన అభివృద్ధి, సంక్షేమ కార్యాచరణతో పాటు రిజర్వేషన్లను కూడా రాజ్యాంగం రచించిన పెద్దలు ఒక ఆసరాగా అణగారిన వర్గాల కోసం అందించారు.

స్వాతంత్ర్యానంతర భారతదేశంలో విద్య, ఉద్యోగాల్లో కొన్ని కులాలు తీవ్ర వెనుకబాటుకు గురవుతుండగా వారిని గుర్తించి, మిగతా వారితో సమానంగా అవకాశాలు కల్పించే ప్రయత్నమే రిజర్వేషన్ల ఏర్పాటు. దీనికి నేపథ్యం స్వాతంత్ర్యానికి పూర్వం నుంచే ఉన్నది. అప్పట్లోనే బ్రిటిష్ వారి కాలంలో 1881-1931 మధ్య జరిగిన 5 జనాభా లెక్కల్లో ఈ వెనుకబాటును గుర్తించి రిజర్వేషన్లు కల్పించింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా ఈ వర్గాల సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ స్థితిగతులను అధ్యయనం చేసిన రాజ్యాంగ ముసాయిదా కమిటీ అదే పద్ధతిని కాలానుగుణమైన మార్పులతో కొనసాగించాలని భావించింది.

రాజ్యాంగంలోని అధికరణం 38 ప్రకారం ప్రభుత్వాలు సామాజిక క్రమాన్ని కాపాడటం ద్వారా ప్రజా సంక్షేమం కోసం పనిచేయాలి. సామాజిక న్యాయం, ఆర్థిక, రాజకీయ న్యాయాలు సాధించాలి. అది ప్రభుత్వాల బాధ్యత. రాజ్యాంగంలో అత్యంత వెనుకబడిన వర్గాలైన ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు చేర్చబడినాయి. అయితే అప్పటికీ ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించబడలేదు. చంపకం దొరై రాజన్ వర్సెస్ స్టేట్ ఆఫ్ తమిళనాడు కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తమిళనాడులో బీసీ రిజర్వేషన్లు చెల్లవని తీర్పు ఇచ్చింది. దీనికి వ్యతిరేకంగా తమిళనాడు అంతటా నిరసనలు పెల్లుబుకాయి. పెరియార్ రామస్వామి నాయకర్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున తమిళ ప్రజలు ఉద్యమించారు. దీంతో దిగొచ్చిన కేంద్రం 1951లో తొలి రాజ్యాంగ సవరణ ద్వారా ఆర్టికల్ 15 (4), 16 (4) లను రాజ్యాంగంలో చేర్చింది. ఈ క్రమంలో 1961లో రాష్ట్రాలు తమ సొంత సర్వేలు నిర్వహించి, రాష్ట్ర-నిర్దిష్ట ఓబీసీ జాబితాలను రూపొందించాలని భారత ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దానికనుగుణంగా ఉమ్మడి ఏపీలో ప్రయత్నాలు జరిగినా పాలకుల చిత్తశుద్ధి లేక విఫలమయ్యాయి. చివరగా అనంత రామన్ కమిషన్ 1970లో సమర్పించిన నివేదిక వల్ల తొలిసారి బీసీలకు రిజర్వేషన్లు దక్కాయి. ఇక కేంద్ర సంస్థల్లో రిజర్వేషన్ల విషయానికి వస్తే మొరార్జీ దేశాయ్ ప్రభుత్వం సామాజికంగా లేదా విద్యాపరంగా వెనుకబడిన తరగతులను గుర్తించడానికి, కేంద్ర సంస్థల్లో రిజర్వేషన్ల కోసం 1979 జనవరి 1 నాడు మండల్ కమిషన్‌ను ఏర్పాటుచేసింది. ఈ కమిషన్ 1980 డిసెంబర్ 31న ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. దురదృష్టవశాత్తూ ఈ నివేదిక పదేండ్ల పాటు కాంగ్రెస్ పాలనలో కోల్డ్ స్టోరేజీలో పెట్టబడింది. మళ్లీ 1990లో నేషనల్ ఫ్రంట్ ఆధ్వర్యంలోని ప్రభుత్వం ఉండగా ఈ నివేదిక వెలుగుచూసింది. సుప్రీంకోర్టు క్లియరెన్స్ ఇవ్వడంతో 1990 ఆగస్టు 7న అప్పటి ప్రధాని వీపీ సింగ్ పార్లమెంట్‌లో



మండల్ కమిషన్ సిఫారసులను అమలు చేస్తామని ప్రకటించారు. బీసీలకు కేంద్రం నియంత్రణలోని విద్యా సంస్థల్లో, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని ప్రకటించి అమలుచేశారు. 1993, సెప్టెంబర్ 8 నుంచి కేంద్ర విద్యావకాశాలు, ఉపాధి రంగాల్లో ఓబీసీ రిజర్వేషన్లు అమలవుతున్నాయి. కుల, జనగణన అవసరం: భారతదేశంలో ఇప్పుడు లభిస్తున్న రిజర్వేషన్లకు స్వాతంత్ర్యానికి పూర్వం 1931లో బ్రిటిష్ ప్రభుత్వం నిర్వహించిన కులగణన మాత్రమే ఆధారం. ఆ తర్వాత ఇప్పటివరకూ కేంద్రం మళ్లీ ఆ పనికి పూనుకోలేదు. 2018లో అప్పటి కేంద్ర హెూంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ తాము 2019లో మళ్లీ అధికారంలోకి వస్తే దేశవ్యాప్త కులగణన చేస్తామని హామీ ఇచ్చారు. తర్వాత వారు అధికారంలోకి వచ్చినా మళ్లీ ఆ మాటే ఎత్తలేదు. బ్రిటిష్ పాలనలో 1881 నుంచి 1931 మధ్య జరిగిన 5 జనాభా లెక్కల్లో అన్ని కులాలను లెక్కించారు. 1951లో నిర్వహించిన మొదటి జనాభా గణనలో, కులాన్ని లెక్కించరాదని జవహర్‌లాల్ నెహ్రూ నేతృత్వంలోని భారత ప్రభుత్వం ఆదేశించింది. అయితే, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు రాజ్యాంగంలో చేర్చారు కాబట్టి ఎస్సీ, ఎస్టీలను లెక్కించేందుకు మినహాయింపు ఇచ్చారు. 1951 నుంచి ప్రతి జనగణనలో షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీలు), షెడ్యూల్డ్ తెగల (ఎస్టీలు) వారిని లెక్కించారు. అయితే అప్పటికే ఎస్సీ, ఎస్టీల అంత ఎక్కువ వెనుకబాటు కాకపోయినా మిగతా కులాల కన్నా వెనుకబాటుకు గురవుతున్న ఓబీసీల సమస్యలు తెరమీదికి వచ్చాయి. అయితే ఓబీసీ రిజర్వేషన్ల కోసం కులాలవారీగా, ప్రాంతాలవారీగా ఓబీసీల జనాభా లెక్కలు తప్పనిసరి. కాబట్టి భారత ప్రభుత్వం ఆ తర్వాత తొలిసారిగా వచ్చిన 2001 జనాభా లెక్కల ప్రకారం ఓబీసీలను లెక్కించి ఉండాలి. కానీ, అలా చేయలేదు. దీనివల్ల మొత్తంగా అన్ని రిజర్వేషన్లు కలిపి 50 శాతానికి మించినప్పుడు ఎవరో ఒకరు కోర్టుకు వెళ్తారు. విచారించిన కోర్టు ఓబీసీల కులగణన జరగలేదు కాబట్టి మొత్తంగా 50 శాతానికి దాటకుండా అందులోనే బీసీ రిజర్వేషన్లు సర్దుబాటు చేయాలని చెప్తూ వచ్చాయి. కాబట్టి ఓబీసీలకు తమ రిజర్వేషన్లు తమకు దక్కాలంటే కులగణన అనివార్యమవుతుంది. 2012లో ఉమ్మడి ఏపీ స్థానిక ఎన్నికల్లో నోటిఫికేషన్ రాగా అదే సమస్య మళ్లీ తెరపైకి వచ్చింది. విషయం కోర్టుకు చేరడంతో హైకోర్టు నిమ్మక జయరాజు వర్సెస్ స్టేట్ ఆఫ్ ఏపీ కేసులో రిజర్వేషన్లు 50 శాతం దాటుతున్నాయనే కారణం చేత బీసీ రిజర్వేషన్లను కొట్టివేసింది. ఇదే సందర్భంలో ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన మరో రెండు తీర్పులు స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల మనుగడనే ప్రశ్నార్థకం చేశాయి. 2021లో మహారాష్ట్ర ఎన్నికలకు సంబంధించిన వికాస్ కిషన్‌రావు గవలి వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసులో అయినా, 2022లో మధ్యప్రదేశ్ ఎన్నికలకు సంబంధించి సురేష్ మహాజన్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మధ్యప్రదేశ్ కేసులో అయినా సుప్రీంకోర్టు స్పష్టంగా ట్రిపుల్ టెస్ట్ ప్రకారం మాత్రమే బీసీ రాజకీయ రిజర్వేషన్లు ఇవ్వాలని తీర్పునిచ్చింది. అంటే%% 1.డెడికేటెడ్ బీసీ కమిషన్ రిజర్వేషన్ ప్రక్రియ పర్యవేక్షించేందుకు నియమించాలి. 2.బీసీల జనాభా నమోదు చేయాలి. వారి వెనుకబాటును నిరూపించగలగాలి. 3.మొత్తంగా రిజర్వేషన్లు 50 శాతం దాటకూడదు.

ఈ నేపథ్యంలో 2023 తెలంగాణ ఎన్నికల సమయంలో కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ బీసీ డిక్లరేషన్ చేసింది. ఇందులో భాగంగా బీసీలకు ఉపవర్గీకరణతో కూడిన 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చి తర్వాత అధికారంలోకి రావడం జరిగింది. ఆ మేరకు కాంగ్రెస్ చర్యలు తీసుకోవలసి ఉన్నది. బీసీ రిజర్వేషన్ల కోసం ఇదివరకే కోర్టులు సూచించిన మేరకు డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం వల్ల చాలా జాప్యం జరిగింది. దాదాపు 12 నెలల కాలం వృథా కావడం జరిగింది.

Printed, Published and Owned by CHERUKU UPENDER, Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Tirumala Nagar Colony, Police Lane, Amberpet, Hyderabad - 500 013 Telangana.
Editor: CHERUKU UPENDAR, Publication at HAMSA PUBLICATIONS, H.No: 7-83/2, Hanuman Nagar Colony, Kuntloor, Abdullapurmet Mandal, Hayath Nagar, Pin:501505,
Rangareddy District/Hyderabad City, Telangana. E-mail:upendrabbk@gmail.com RNI: TELTEL12215